## క్లుప్తంగా

### నేడు మంత్రి పొన్నం రాక

ఎల్కతుర్తి: భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండల కేంద్రాలకు నేడు(గురువారం) రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ రానున్నట్లు కాంగ్రెస్ నాయకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొంటారని తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పార్టీ మండల అధ్యక్షుడు ఎలిగేటి ఇంద్రసేనారెడ్డి, చిట్టంపల్లి అయిలయ్య కోరారు.

### పెద్దమ్మతల్లి ఆలయానికి భూదానం



శాయంపేట: మండలంలోని కొప్పుల గ్రామంలో పెద్దమ్మ తల్లి దేవాలయ నిర్మాణానికి మాజీ జెడ్పీటీసీ వంగాల రమాదేవి నారాయణ రెడ్డి వారి తల్లిదండ్రులు వంగాల రాధమ్మరాంరెడ్డిల జ్ఞాపకార్థం బుధవారం 10గుంటల భూమిని విరాళంగా అందజేశారు. భూమిని రూ.3లక్షల 75వేల రూపాయకులకు కొనుగోలు చేసిన వంగాల నారాయణ రెడ్డి.. ముదిరాజ్ కుల పెద్దలకు భూమి కాగితాలు అప్పగించారు. వంగాల నారాయణ రెడ్డి వంశానికి పెద్దమ్మతల్లి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ముదిరాజ్ కులపెద్దలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

### దుస్తుల పంపిణీ



ఆత్మకూరు: మండలకేంద్రంలోని ఆత్మకూరు ఇండియా పెంతెకోస్తు చర్చిలో బుధవారం నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా పెరుమాండ్ల శాలిని–రామకృష్ణ దంపతులు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రామకృష్ణ మాట్లాడుతూ.. స్వగ్రామంలో సేవలందించడం ఆనందంగా ఉందన్నారు. నూతన ఏడాదిలో ప్రతీ ఒక్కరూ ఆనందంగా ఉండాలని ఆకాంక్షించారు. దేవుని ఆశీస్సులు ప్రజలపై ఎల్లప్పుడు ఉండాలని కోరుకున్నారు. కార్యక్రమంలో పాస్టర్ పెరుమాండ్ల భాస్కర్, విల్సన్, కోర్నెల్, రాజు, చిన్ని, ఉమ తదితరులు పాల్గొన్నారు.

### సునీతకు డాక్టరేట్



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ లోని కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాలలోని పరిశోధకురాలు మాలోతు సునీతకు యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రకటించింది. ఉమెన్ ఎంపవర్‌మెంటు త్రో మైక్రో ఫైనాన్స్–ఎకేస్ స్టడీ ఆఫ్ వరంగల్ డిస్ట్రిక్ట్ అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి సునితకు డాక్టరేట్‌ను ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య కె.రాజేందర్ తెలిపారు. ఆ విభాగం రిటైర్డ్ ఆచార్యులు డి.సాక్రియా పర్యవేక్షణలో సునీత తన పీహెచ్‌డీ పూర్తి చేశారు.

### 'వాస్తవాలతో చరిత్ర సృష్టించవచ్చు'

హన్మకొండ: దేశంలోని బహుజన వీరుల వీరోచిత వాస్తవ చరిత్ర తెలుసుకుంటేనే చరిత్ర సృష్టించగలమని వివిధ సంఘాల నాయకులు అన్నారు. బుధవారం హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద తెలంగాణ రాష్ట్ర అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ మదుపాక ఎల్లయ్య అధ్యక్షతన బీమా కోరేగాం యుద్ధ వీరుల 207వ విజయ దివస్ జరుపుకున్నారు. ఈ సందర్భంగా వీసీకే పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జిలుకర శ్రీనివాస్, ఆల్ ఇండియా ఓబీసీ జాక్ చైర్మన్ సాయిని నరేందర్, అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు చిట్యాల బాబు, మొకాల యాదగిరి, డాక్టర్ ఎల్లయ్య, బీఎస్పీ నాయకుడు గంధం శివ, తెలంగాణ ఉద్యమకారుల ఐక్య వేదిక రాష్ట్ర కన్వీనర్ సోమ రామమూర్తి, ట్రైబల్ యునైటెడ్ ఫ్రంట్ అధ్యక్షులు ఉదయ్ సింగ్‌లు మాట్లాడారు. కార్యక్రమంలో తాడిశెట్టి క్రాంతి కుమార్, డాక్టర్ నవీన్, కందుల కొమురయ్య, బంగారు బాబు, సింగారపు, ఐలయ్య, తదితరులు పాల్గొన్నారు.

### గంజాయి మత్తులో యువత హల్‌చల్

ఖిలా వరంగల్ : వరంగల్ నగరంలోని 36వ డివిజన్ చింతల్ జ్యోతిబసునగర్‌లో బుధవారం రాత్రి యువత గంజాయి మత్తులో హల్‌చల్ చేశారు. ఇదేంటని అడిగిన నానాజి వ్యక్తిపై దాడి చేసినట్లు సమాచారం. ఈ దాడిలో అతనికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు హుటాహుటిన ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. యువత మత్తుకు బానిసై దాడులకు తెగపడుతున్నారని మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్‌లో స్థానికులు ఫిర్యాదు చేశారు. అయినా పోలీసులకు పట్టింపులేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా చింతల్ ఏరియాలో పోలీసుల గస్తీని మరింత ఉధృతంగా చేపట్టాలని బాధితులు కోరుతున్నారు.

# భయం.. భయంగా..

- జాతీయ రహదారిపై కమ్ముకున్న చీకటి
- రోడ్డెక్కాలంటేనే జంకుతున్న ప్రయాణికులు
- సర్వీస్ రోడ్డులో వెలగని లైట్లు
- స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో అతివేగంగా వెళ్తున్న వాహనాలు
- ప్రమాదాలబారిన పడుతున్న ప్రజలు



రహదారిపై కమ్ముకున్న చీకటి



స్పీడ్ బ్రేకర్లు లేక వేగంగా వెళ్తున్న వాహనాలు

ధర్మసాగర్: కొన్నేళ్ల క్రితం నిర్మించిన జాతీయ రహదారి (ఓఆర్ఆర్)పై చీకటి కమ్ముకుంది. దీనితో ఆ రోడ్డుపై ప్రయాణించాలంటేనే జనం జంకుతున్నారు. కరుణాపురం శివారు నుంచి రాంపూర్, ఎల్కుర్తి, ధర్మసాగర్, టేకులగూడెం, ఉనికిచర్ల, దేవన్నపేట తదితర గ్రామాల మీదుగా భూపాలపట్నం వరకు నాలుగు వరుసల జాతీయ రహదారి నిర్మించారు. అక్కడక్కడా సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటు చేశారు. కొన్ని ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్లు కూడా వేశారు. కానీ, అవసరం ఉన్న చోట లైట్లు, స్పీడ్ బ్రేకర్లు వేయడం మరిచారు. కాజీపేట మండలంలోని టేకులగూడెంతోపాటు ధర్మసాగర్ మండలంలోని, పెద్దపెండ్యాల, ఎల్కుర్తి గ్రామాలకు వెళ్లే రహదారి వద్ద సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయకపోవడంతో నిత్యం ఆయా ప్రాంతాల్లో ప్రమాదాలు చోటుచేసు కుంటున్నాయి. కాజీపేట నుంచి టేకులగూడెం, మడికొండ నుంచి ఎల్కుర్తి, రాంపూర్ నుంచి పెద్ద పెండ్యాల గ్రామాలకు వెళ్లే ప్రయాణికులు జాతీయ రహదారి మీదుగా క్రాస్ చేసి వెళ్లాలి.. అయితే జాతీయ రహదారిపై లైట్లు లేకపోవడంతోపాటు.. (ఓఆర్ఆర్) జాతీయ రహదారి గుండా వెళ్లే వాహనాలు అతి వేగంగా వెళ్తున్నాయి. దీంతో ఆయా గ్రామాలకు వెళ్లే ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇటీవల ఆయా ప్రాంతాల్లో అనేక ప్రమాదాలు జరిగిన సంఘటనలు ఉన్నాయి. అయితే ఆ ప్రాంతాల్లో ఎక్కడ కూడా స్పీడ్ బ్రేకర్‌లు వేయలేదు. అదేవిధంగా ధర్మసాగర్ బ్రిడ్జి వద్ద నిర్మించిన సర్వీస్ రోడ్డుకు కూడా స్పీడ్ బ్రేకర్ల నిర్మాణం చేపట్టలేదు. దీంతో జాతీయ రహదారి నుంచి సర్వీస్ రోడ్డు మీదుగా ధర్మసాగర్ వెళ్లే ప్రయాణికులకు బ్రిడ్జి క్రింది నుంచి వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో బ్రిడ్జి వద్ద ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అదేవిధంగా బ్రిడ్జిపైన అమర్చిన లైట్లు వేలగకపోవడంతో చీకటిలో సర్వీస్ రోడ్డు గుండా, బ్రిడ్జి కిందుగా వెళ్లే ప్రయాణికులకు కూడా ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ఇటీవల ఉనికిచర్ల బ్రిడ్జి పక్కన నిర్మించిన సర్వీస్ రోడ్డు గుండా ఓ ప్రయాణికుడు ద్విచక్ర వాహనంపై వస్తున్న క్రమంలో బ్రిడ్జి కిందుగా వస్తున్న వాహనం రెండు వాహనాలు ఢీ కొనడంతో పెద్ద ప్రమాదం జరిగింది. అయితే ఆ సమయంలో వెంటనే సంబంధిత గుత్తేదారు స్పందించి బ్రిడ్జికి ఇరువైపులా సర్వీస్ రోడ్డులో రెండు వైపుల స్పీడ్ బ్రేకర్లు వేశారు. అంటే ప్రమాదాలు జరిగితేనే కాంట్రాక్టర్ స్పందిస్తారా.. లేదంటే స్పందించరా..? అని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆయా గ్రామాల పరిధిలో జాతీయ రహదారిపై, బ్రిడ్జికి ఇరువైపులా నిర్మించిన సర్వీస్ రోడ్డులో స్పీడ్ బ్రేకర్లతోపాటు లైటింగ్ సిస్టం ఏర్పాటు చేయాలని ప్రజలు వేడుకుంటున్నారు.

### స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి



ధర్మసాగర్ బ్రిడ్జి వద్ద నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. జాతీయ రహదారి గుండా టేకులగూడెం, ఎల్కుర్తి, పెద్దపెండ్యాల గ్రామాలకు వెళ్లే ప్రయాణికులు జాతీయ రహదారి మీద నుంచి క్రాస్ చేసే సమయంలో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అదేవిధంగా సర్వీస్ రోడ్డులో స్పీడ్ బ్రేకర్లు, లైట్లు లేకపోవడం కూడా ప్రమాదాలకు కారణమవుతోంది. ఇప్పటికైనా సంబంధిత కాంట్రాక్టర్, అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలి.

– రావుల వెంకట్‌రెడ్డి, ధర్మసాగర్

## శాయంపేటలో అయ్యప్ప నగర సంకీర్తన



నగర సంకీర్తన నిర్వహిస్తున్న స్వాములు

శాయంపేట : మండల కేంద్రంలోని శ్రీమత్స్యగిరి స్వామి దేవాలయంలో ఆలయ కమిటీ చైర్మన్ సామల భిక్షపతి ఆధ్వర్యంలో బుధవారం తెల్లవారు జామున అయ్యప్ప స్వామి నగర సంకీర్తన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆరుట్ల కృష్ణమాచార్యులు అయ్యప్ప స్వామి పంచలోహ విగ్రహానికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అయ్యప్ప విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో ప్రతిష్ఠించి గ్రామంలోని ప్రధాన వీధుల గుండా అయ్యప్ప భక్తి పాటలు, భజనలతో నగర సంకీర్తన వైభవంగా నిర్వహించారు. భక్తులు స్వామి వారికి మంగళహారతులు ఇచ్చారు. అనంతరం ఆలయంలో చింతల స్వేతాశ్రీనివాస్ రెడ్డి దంపతులు అయ్యప్ప మాల ధరించిన స్వాములకు అల్పాహారం అందించారు. కార్యక్రమంలో స్వాములు దిడ్డి రమేశ్ బొల్లెపల్లి సదానందం, కొప్పుల శ్రీధర్ రెడ్డి, వినుకొండ రాజ్‌కుమార్, కందగట్ల రమేశ్, మార్త సుమన్, బాసని మల్లికార్జున్, బాలకృష్ణ, గట్టు కిషన్, గోరంటల ప్రశాంత్, లోకలబోయిన కుమారస్వామి, దుర్గాల రాజు, బాబురావు, ప్రభాకర్, రాజేశ్వర రావు, ఉమాశంకర్, శ్రీకాంత్, హరిబాబు, మాధవ, చంటి, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## భక్తులకు సదుపాయాలు కల్పించండి

- మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్



మల్లన్న సన్నిధిలో అరూరి రమేశ్ దంపతులు

ఐనవోలు: మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్–కవితకుమారి దంపతులు బుధవారం నూతన ఆంగ్ల సంవత్సరాన్ని పురస్కరించుకుని ఐనవోలు మల్లికార్జున స్వామిని దర్శించుకున్నారు. కాగా అర్చకులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. వేదపండితులు వేదాశీర్వచనం చేసి స్వామి వారి శేషవస్త్రాలు అందజేశారు. ఈ సందర్భంగా అరూరి రమేశ్ మాట్లాడుతూ.. లక్షలాది మంది పాల్గొనే జాతరను ప్రతిష్ఠాత్మకంగా భావించి నెల రోజుల ముందుగానే అధికారులతో సమీక్షించి భక్తులకు సకల సదుపాయాలు కల్పించి జాతరను సక్సెస్ చేశామని గుర్తు చేశారు. ప్రస్తుతం జాతర సమీపిస్తున్నప్పటికీ ఏర్పాట్లు సరిగా లేవని అసంతృప్తి వ్యక్తం చేశారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అధికారులు, ప్రభుత్వం పకడ్బందీ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మజ్జిగ జైపాల్, మార్గం భిక్షపతి, ఉస్మాన్ అలీ, ఆరె అశోక్ పాల్గొన్నారు.

## క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న సత్యనారాయణ రావు

శాయంపేట : మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ క్యాలెండర్‌ను బుధవారం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నూతన సంవత్సరంలో ప్రతి ఇంటా సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, భూపాలపల్లి నియోజకవర్గ ప్రజలను నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు దూదిపాల బుచ్చిరెడ్డి, పరకాల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మారెపల్లి రవీందర్, పరకాల ఏఎంసీ మాజీ చైర్మన్ పోలెపల్లి శ్రీనివాస్ రెడ్డి, నాయకులు హింగే భాస్కర్, దేవనాడి మల్లాజీ, గోపాల్ రెడ్డి, దేవేంద్రచారి, సాంబయ్య, సుధాకర్, రాజు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి అండగా ఉంటా..

- ఎమ్మెల్యే సత్యనారాయణ రావు



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే, తదితరులు

శాయంపేట : గుండెపోటుతో మృతిచెందిన శాయంపేట మండల కేంద్రానికి చెందిన జర్నలిస్ట్ బాల్నె తిలక్‌బాబు కుటుంబానికి అండగా ఉంటానని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. బుధవారం ఎమ్మెల్యే బాధిత కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించి, తిలక్‌బాబు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తిలక్ నిజాయితీ పరుడిగా పేరొందారిన తెలిపారు. ప్రజా సమస్యలపై ఎంతో అవగాహన ఉన్న తిలక్ వంటి జర్నలిస్టును కోల్పోవడం బాధాకరమన్నారు. తిలక్ కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఆయన వెంట తెలంగాణ రాష్ట్ర మినిమం వేజెస్ అడ్వైజరీ బోర్డు మెంబర్ బాసాని చంద్రప్రకాశ్, పరకాల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మారెపల్లి రవీందర్, నాయకులు చిందం రవి, బాసాని మార్కండేయ, పోలెపల్లి శ్రీనివాస్ రెడ్డి, బాసాని లక్ష్మీనారాయణ, కొమ్ముల భాస్కర్ ఉన్నారు.

## బీరన్న ఆలయంలో ప్రత్యేక పూజలు



మొక్క నాటుతున్న రవి, తదితరులు



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని గురిజాలలోని బీరన్న ఆలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో కమిటీ చైర్మన్ డ్యాక రవి మొక్కను నాటారు. కార్యక్రమంలో డైరెక్టర్ అల్లి శ్రీను, కురుమ సంఘం గౌరవ అధ్యక్షుడు అన్న రాజమల్లు, ఉపాధ్యక్షుడు సుధాకర్, రమేశ్, రవి, రవి, తదితరులు పాల్గొన్నారు.

**మెట్టుగుట్టపై..**

మడికొండ: నూతన సంవత్సరం సందర్భంగా మడికొండలోని మెట్టురామలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వయంభూ లింగానికి ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు నిర్వహించిన అనంతరం ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా హనుమకొండ సీనియర్ సివిల్ జడ్జి సాయి కుమార్ దర్శించుకొని అభిషేకం నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి శేషుభారతి, చైర్మన్ రఘుచందర్, ధర్మకర్తలు రాజుగౌడ్, దయాకర్, కేదారి, ఉమ, జ్ఞానేశ్వరీ, భక్తులు పాల్గొన్నారు.

# మీ భద్రత మీ చేతుల్లోనే..

- రహదారి భద్రత జీవన విధానం కావాలి
- నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు దూరం
- వరంగల్ ఎంవీఐ జేపాల్‌రెడ్డి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఆర్టీఏ అధికారులు

ఖిలావరంగల్ : రహదారి భద్రత మీచేతుల్లోనే ఉంటుందని, ఇందుకు రహదారి భద్రత ఒక నినాదంలా కాకుండా సామాజిక బాధ్యత, జీవన విధానంగా మల్చుకున్నప్పుడే ప్రమాదాలను నివారించవచ్చని రవాణాశాఖ సీనియర్ ఎంవీఐలు జేపాల్‌రెడ్డి, శోభన్‌బాబు సూచించారు. ఈనెల 1 నుంచి 31వ తేదీ వరకు జరగనున్న రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా బుధవారం వరంగల్ ఆర్టీఏ జంక్షన్‌లో రవాణాశాఖ ఉపకార్యాలయం ఆధ్వర్యంలో బుధవారం రోడ్డు ప్రమాదాలపై హెవీ వెహికిల్స్ వాహనాల డ్రైవర్లు, ఓనర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాహనదారులు, డ్రైవర్లు రహదారి భద్రతా నియమాలు పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చన్నారు. వాహనాలల్లో పరిమితిని మించి ప్రయాణీకులు, ఓవర్‌లోడ్‌ను అనుమతించవద్దని సూచించారు. అతివేగం ప్రమాదకరమని, మద్యం సేవించి, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనాలను నడుపరాదన్నారు. వాహనదారులు రాత్రివేళల్లో వాహనాన్ని నిలిపి ఉంచినప్పుడు పార్కింగ్ లైట్లు తప్పనిసరిగా వేసి ఉంచడం వల్ల ప్రమాదాలను నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో ఏఓ నరేందర్, ఇతర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# అంబరాన్నంటిన 'నూతన' సంబురాలు



శాయంపేటలో ముగ్గు వేస్తున్న మహిళ



కమలాపూర్‌లో..



దామెర: ఊరుగొండలో..

- కేక్ కటింగ్‌లు, న్యూఇయర్ శుభాకాంక్షలు
- మెసేజ్‌లతో మార్మోగిన సెల్‌ఫోన్లు
- ఇళ్లముంగిట రంగవల్లుల సోయగం

ఎల్కతుర్తి: నూతన సంవత్సర సంబురాలు అంబరాన్నంటాయి. యువత కేరింతలతో గ్రామీణ ప్రాంత పల్లెలన్నీ మారుమోగాయి. 2025 నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండలాల పరిధిలోని పిల్లలు, పెద్దలు కొత్త సంవత్సర వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. యువత మంగళవారం రాత్రి నుంచే వేడుకలు ప్రారంభించగా పోలీసుల ఆంక్షలతో ప్రశాంత వాతావరణం మధ్య వేడుకలు జరిగాయి. అర్ధరాత్రి 12గంటలు దాటిన అనంతరం 2024 సవత్సరానికి వీడ్కోలు పలుకుతూ నూతన సంవత్సరానికి ఆహ్వానం తెలిపి కేకులు కట్ చేశారు. అనంతరం బాణా సంచాలు పేల్చి ఒకరికొకరు న్యూఇయర్ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. బుధవారం తెల్లవారుజామునుంచే సెల్‌ఫోన్లు న్యూ ఇయర్ మెసేజ్‌లతో మార్మోగిపోయాయి. మహిళలు వాకిళ్లలో ముగ్గులు వేసి కలర్‌ఫుల్ రంగులద్ది నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పుకున్నారు. సంవత్సరమంతా ప్రతీ ఒక్కరి జీవితాలు ఆనందంగా సాగాలని ఆకాంక్షిస్తూ పలు ఆలయాల్లో ప్రత్యేక ప్రార్థనలు, పూజలు నిర్వహించారు.

శాయంపేట : మండలంలోని 24గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా శాయంపేట సర్కిల్ సీఐ రంజిత్‌రావు, ఎస్సై పరమేష్, సిబ్బంది భద్రతా చర్యలు చేపట్టారు.

కమలాపూర్: మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ప్రజలు ఆంగ్ల నూతన సంవత్సర వేడుకలు బుధవారం ఘనంగా జరుపుకున్నారు. నూతన సంవత్సర వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ఇన్‌స్పెక్టర్ ఎల్కటూరి హరికృష్ణ, ఎస్సై వీరభద్రరావు ఆధ్వర్యంలో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించారు. దేవాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు, చర్చీల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.



ఐనవోలు: వేడుకల్లో పాల్గొన్న రవీందర్‌రావు

దామెర: దామెశ్వరాలయం, ఆంజనేయస్వామి ఆలయం, ఊరుగొండ రామలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామి వారికి అభిషేకాలు నిర్వహించారు.

**శుభాకాంక్షలు తెలిపిన మార్నేని**

ఐనవోలు: తెలంగాణ కో ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు ఆధ్వర్యంలో ఆంగ్ల నూతన సంవత్సరం 2025 వేడుకలు బుధవారం జరుపుకున్నారు. ఈ సందర్భంగా బ్యాంక్ ఉద్యోగులు, వర్ధన్నపేట నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దెత్తున పాల్గొన్నారు. కేక్ కట్ చేసి బ్యాంక్ ఉద్యోగులు, శ్రేయోభిలాషులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

### మనస్సును ప్రశాంతంగా ఉంచుకోవాలి



మాట్లాడుతున్న బ్రహ్మకుమారి సునీత

హన్మకొండ: డ్రైవర్లు మనస్సును ప్రశాంతంగా ఉంచుకోవాలని బ్రహ్మకుమారి సునీత అన్నారు. జాతీయ భద్రతా మాసోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. హనుమకొండ వరంగల్–1 డిపోలో అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడుతూ డ్రైవర్లు జాగ్రత్తగా, ఏకాగ్రతతో బస్సు నడిపి ప్ర యాణికులను క్షేమంగా గమ్యస్థానానికి చేర్చాలన్నారు. ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్ డి.విజయ భాను మాట్లాడుతూ డ్రైవర్లు శారీరంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉండాలన్నారు. వరంగల్–1 డిపోను జీరో ఆక్సిడెంట్ డిపోగా నిలుపాలన్నారు. డిప్యూటీ ఆర్ఎం (ఆపరేషన్) కేశరాజు భాను కిరణ్ మాట్లాడుతూ దేశంలో రోడ్డు యాక్సిడెంట్ల వల్ల ప్రతి మూడు నిమిషాలకు ఒకరు మరణిస్తున్నారని, ప్రమాదాలతో ఆర్టీసీ వరంగల్ రీజియన్ ఏప్రిల్ 2024 నుంచి నవంబర్ వరకు సుమారు రూ.48 కోట్ల నష్టపరిహారం చెల్లించాల్సి వచ్చిందన్నారు.

## సివిల్ సప్లయీస్ కార్మికుల రిలే నిరాహార దీక్ష



దీక్షలో పాల్గొన్న సివిల్ సప్లయీస్ కార్మికులు

పరకాల: తెలంగాణ ప్రభుత్వం సివిల్ సప్లయీస్ కార్మికులకు బస్తాలపై పెంచిన ధరలను తక్షణమే అమలులో తీసుకురావాలని పరకాల సివిల్ సప్లయీస్ గోదాం కార్మిక సంఘం అధ్యక్షుడు గడ్డం సురేష్ డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్త ఆందోళన కార్యక్రమంలో భాగంగా పరకాల సివిల్ సప్లయీస్ గోదాం ఎదుట కార్మికులు రిలే నిరాహారదీక్ష నిర్వహిస్తున్నారు. ఈ దీక్షను ఉద్దేశించి బుధవారం సురేష్ మాట్లాడారు. పెంచిన ధరలను ప్రభుత్వం అమలు చేయాలని, లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మచ్చ శంకర్, కృష్ణ, జి.మహేందర్, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

## ఐక్యతతోనే అన్ని రంగాల్లో అభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

సంగెం : ఐక్యతతోనే సామాజిక, ఆర్థిక, రాజకీయ, ఇతర అన్ని రంగాల్లోనూ అభివృద్ధి సాధించగలమని లక్కమారి కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోనె శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని వంజరపల్లిలో లక్కమారి కాపు పొదుపు సంఘం 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా బుధవారం రజతోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పొదుపు సంఘం ఏర్పాటు చేసుకుని 25 ఏళ్లుగా ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా ముందుకు సాగుతున్నట్టు తెలిపారు. అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నట్టు చెప్పారు. అన్ని గ్రామాల్లోనూ పొదుపు సంఘాలు ఏర్పాటు చేసుకుని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పెండ్లి పురుషోత్తం, నాయకులు మంద రాజమల్లు, అనుముల నర్సిరెడ్డి, గూడ సుదర్శన్‌రెడ్డి, రవీందర్, ఏడాకుల మల్లారెడ్డి, కూస రవి, గోనె మల్లారెడ్డి, పెంతల స్రవంతి అనిల్, తదితరులు పాల్గొన్నారు.

## అనాథ వృద్ధులకు దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న కృష్ణంరాజు

కాజీపేట: పట్టణంలోని రైల్వే ఆఫీసర్స్ క్లబ్ ఆవరణలో బుధవారం 200 మంది అనాథ వృద్ధులకు దుప్పట్లు, బ్రెడ్ ప్యాకెట్లను అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ కృష్ణంరాజు పంపిణీ చేశారు. రైల్వే కాంట్రాక్టర్ పి.సురేష్ కుమార్ సహకారంతో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో రైల్వే అధికారులు అనాథలకు చేయూతనందించారు. నార్లగిరి రమేష్, శివకుమార్, అఫ్జల్, మల్లేశం, ప్రదీప్, పాల్గొన్నారు.